కథా నిలయం
శ్రీకాకుళం

# దిష్టిబొమ్మ

మొక్కజొన్న చేలో ఉంచిన దిష్టిబొమ్మ కంటే మంచెమీద కూర్చున్న మల్లయ్య వికృతంగా ఉన్నాడు. తలంతా రేగిపోయి చీకేసిన తాటికాయలా ఉంది. కళ్ళు గుంటలు పడ్డాయి. మల్లయ్య తొడుక్కున్న చొక్కాకంటే దిష్టిబొమ్మకు వేసిన చొక్కా తెల్లగా ఉంది. చొక్కాకు గుండీలు ఉన్నాయి. మల్లయ్య తొడుక్కున్న చొక్కాకు గుండీలు లేవు. మల్లయ్య గుండె లేనిమనిషిలా ఉంటాడు.

దిష్టిబొమ్మను చూస్తూనే మల్లయ్యకు కంపరమెత్తుతుంది. దిష్టిబొమ్మంటే అసహ్యం కూడా. అయినా, అతనిచేతులతోనే ఆ బొమ్మను తయారుచెయ్యక తప్పిందికాదు. మొట్ట మొదటిసారిగా దిష్టిబొమ్మ తయారుచేసి చేలో పెట్టమని యజమాని బుచ్చిరాజు చెప్పినప్పుడు "దిట్టిబొమ్మ నాను సెయ్యను, దొరా!" అని వినయంగానే అన్నాడు మల్లయ్య.

"అది తయారుచెయ్యడం పెద్ద కష్టమట్రా? రెండు కర్రముక్కలను అడ్డంగా కట్టి గడ్డి చుట్టటమే గదా? నెత్తిమీద సున్నంకొట్టిన పిడత పెట్టటమేగా? ఆ బొమ్మకు పాత చొక్కా కావాలంటే నే నిస్తాలె!" అన్నాడు బుచ్చిరాజు, లంక పొగాకు చుట్ట అవతలపరేస్తూ.

"అదిగాదుగాని, దొరా– దిట్టి బొమ్మగాని సేత్తే దరిద్రం మట్టుకొంటదని మా యమ్మ సెప్పింది, దొరా!"

"ఇప్పు డేదో నువ్వు పెద్ద షావుకారయినట్లు మాట్లాడతా వేమిట్రా, గాడిదకొడకా! నీ అయ్య వెనక దిష్టిబొమ్మలు తయారుచేసే వాడటగా?" మల్లయ్యవైపు గుడ్లురిమి చూశాడు బుచ్చిరాజు.

"మాయమ్మ అదే సెప్పింది, బాబో! 'ఒరేయ్, మల్లిగా! నీ అయ్యా గడ్డిబొమ్మలు సేసి, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపొయ్యాడు. నువ్వుగాని ఆ పనికి పూనుకోక' అని సెప్పిందండి. మరియినుకోవాల గదండీ పెద్దోళ్ళమాట?"

బుచ్చిరాజు ఉగ్రుడైపోయాడు.

"నా ఉప్పు, పులుసు తింటూ నాకే ఎదురు చెబుతావ్రా? నీ అమ్మేమో నీకు పెద్ద... నేనొక వెధవను. ఒరేయ్! నీ పురాణం వినే ఓపిక నాకు లేదు. వేస్తే వెయ్యి! లేకపోతే పని మానుకో!"

మల్లయ్య పని మానుకోలేదు.

ఆరేళ్ళప్పుడు మొదటిసారిగా దిష్టిబొమ్మను చూశాడు మల్లయ్య. గుడిసె దగ్గర గొడవ చేస్తుంటే, పుల్లయ్య కొడుకును వెంట బెట్టుకుని పొలం వెళ్ళాడు. జొన్నచేలో దిష్టిబొమ్మలు చూడగానే దడుసుకుని తండ్రికి చెప్పకుండా ఇంటికి పరుగెత్తాడు. అర్ధరాత్రి వేళల్లో చెట్లలో, పుట్లలో తిరిగే పుల్లయ్యకు దిష్టిబొమ్మను చూసి దడుచుకున్న కొడుకు మీద మహా చెడ్డకోపం వచ్చింది. మరుసటి రోజు బలవంతాన కొడుకును లాక్కెళ్ళి మంచె పక్కనున్న వేపచెట్టుకు కట్టేశాడు. మల్లయ్యకు సాయంత్రం వరకూ కళ్ళెదుట దిష్టిబొమ్మ కనబడుతూనే ఉంది. జ్వరం తగిలి వారంరోజులు మంచానికి బల్లిలా కరుచుకుపోయాడు. ఆ తర్వాత అప్పుడప్పుడు తండ్రి అతని ముందే ఆ బొమ్మలు తయారుచేస్తుండటంతో అవంటే భయం తగ్గింది కాని, వాటిపట్ల అసహ్యం పేరుకుపోయింది.

కొంచెం పెద్దయ్యాక ఎవరూ లేనప్పుడు పొలాల్లో కనిపించే దిష్టిబొమ్మలను తగల బెట్టడం, గడ్డిబొమ్మల తలలుగా అమర్చిన మట్టి పిడతలను పగలగొట్టడం చేస్తూండేవాడు. ఓసారి ఎవరో పొలం నుండి దిష్టిబొమ్మను తెచ్చి గుడిసె దగ్గర పడేస్తే, పుల్లయ్య కొడుకును ముక్క చీవాట్లు పెట్టాడు.

"ఒరే, మల్లిగా! నాను సెబుతున్నా వినుకో! నువ్వుగాని కుప్పల దగ్గర ధాన్యం, ఇళ్ళలో డబ్బు నూక్కొచ్చినా నా నొప్పుకుంటాగాని, దిట్టిబొమ్మ నూక్కొత్తే ఊరుకోను రోయ్! ఎవుడున్నా దిట్టిబొమ్మ కాజేస్తే అక్కడ వర్షాలు కురవ్వు! కరువొత్తది. నా మాట వినుకో! దిట్టి బొమ్మల్ని పాడుజేత్తివా నీ మక్కిలిరగదంతా నంతే!"

ఆ రోజు నుంచి దిష్టిబొమ్మల జోలికి పోలేదు మల్లయ్య.

వేపచెట్టును నాలుగవ స్తంభంగా ఏర్పాటుచేసుకొని మంచె కట్టుకున్నాడు మల్లయ్య. వేపచెట్టు చుట్టూ ఉన్న రెండెకరాల పొలంలో మొక్కజొన్న వేసి ఉంది.

వేపచెట్టుమీద చేరిన కాకులు గొడవచేస్తున్నాయి. రెండు కాకులు పోట్లాడు కొంటూంటే, మిగిలినవి వాటికేసి పరీక్షగా చూస్తున్నాయి.

సాయంత్రం చిక్కిపోతున్నది.

పడమట దిక్కున సూర్యబింబం ఎర్రకుంకుమ బొట్టులా మెరుస్తోంది. దూరంగా నునుపుగా కనిపిస్తున్న కొండలు సూర్యుడిని మింగెయ్యడానికి నోళ్లు తెరుచుకొని ఉన్నాయి. అప్పటివరకు చిట్టి గుంటద్దగర ఒంటికాలిపై తపస్సు చేసిన కొంగలు, తపస్సు చాలించి హడావుడిగా వెళ్లిపోతున్నాయి. టౌను నుంచి తిరిగి వెళుతున్న హైస్కూలు విద్యార్థులు డొంక మీద కేకలు పెట్టుకొంటూ వెళుతున్నారు. పల్లెటూళ్ళతో సినిమా ప్రచారం పూర్తి చేసుకొని టౌనువైపు వెళుతున్నది గూడురిక్షా. ఎదురుగాలిలో తొక్కలేక తొక్కుతున్నాడు రిక్షావాడు. పల్లెల నుంచి టౌనులో ఉన్న పాలకేంద్రానికి పాలుచేరుకుంటున్నాయి. ఒంటెద్దు బండి మీద టౌను నుంచి పల్లెటూరు కల్తీ సరుకులు సరఫరా అవుతున్నాయి.

డొంకమీద వెళుతున్నవారు మల్లయ్యకు అస్పష్టంగా కనిపిస్తున్నారు. మోకాళ్ళపై తలవాల్చి అటువైపే చూస్తూ కూర్చున్నాడు. మధ్యాహ్నం పంట చేసుకోకపోవడంతో తిండిలేక నీరసంగా ఉన్నాడు. లేచి నిలబడే ఓపిక ఉన్నా, లేవాలనిపించటంలేదు.

సాయంత్రం విన్న వార్తతో అతని మెదడు మొద్దుబారిపోయింది.

మల్లయ్య కొడుకు కొండలరావుని జెయిల్లో పెట్టారు.

బుచ్చిరాజు కొడుకు చేస్తున్న దొంగనోట్ల వ్యాపారం పూర్తిగా కొండలరావు చేస్తున్నదిగా పోలీసులకు కనిపించింది.

బుచ్చిరాజు తన కొడుకును ప్రేమగా చూడటం మొదటి నుంచీ మల్లయ్యకు అనుమానంగానే ఉంది. కొండలరావుకు బట్టలు కొనిపెట్టడం, సినిమాలకు డబ్బులివ్వడం, మద్రాసు చూపించడం- ఎలానయితేనేం మల్లయ్య కొడుకును మచ్చిక చేసుకొని తన కొడుక్కి జతకుదిర్చాడు. కొండలరావును చదువు చెప్పిస్తానని మొదట మల్లయ్య నుండి వేరుచేసి టౌనులో ఉంచేశాడు

బుచ్చిరాజు కొడుకు సుందరానికి, కొండలరావుకు అన్ని అలవాట్లు అబ్బాయి. కొండలరావు వ్యసనాలకు బానిసయితే, వ్యసనాలు సుందరానికి బానిసలయ్యాయి. కొండలరావు ఖరీదయిన బట్టలేసుకుని తిరుగుతుంటే మల్లయ్య సంతోషపడేవాడు కాదు. దిష్టిబొమ్మను చూస్తే ఎంత అసహ్యం వేసేదో, వాడిని చూస్తే అంత అసహ్యం వేసేది. కొడుకును పలకరించేవాడు కాదు. టౌనులో పాతడాబా కొని, కొండలరావు పేర పెట్టినా, అతను అసలు విషయం గ్రహించలేదు. ఆ డాబాలోనే దొంగనోట్లు అచ్చు అయ్యాయి. సుందరం అనుచరులు, కొండలరావు ఆ నోట్లను పెద్ద ఎత్తున మార్చేవారు.

మోసం బట్టబయలయింది.

బుచ్చిరాజు కొడుకు మీదకు ఆ నేరం రాకుండా చూసుకొన్నాడు.

మల్లయ్య కడుపు దహించుకుపోతూంది. ఆవేశంలో జుట్టుపీక్కోసాగాడు.

'ఛీ ఛీ! యదవనాయాళ్ళు! నమ్మినోళ్ళకే ద్రోహం తలపెట్టారు. తన తండ్రి వీళ్ళ పొలాలకే కాపలా కాస్తూ ఈ భూమిమీదే గతుక్కుమన్నాడు. తనూ ఎప్పుడో ఇక్కడే రాలిపోతాడు..... బుచ్చిరాజు, ఆడి కొడుకులు టౌనులో వెచ్చగా గురకపెడుతూ, పరుపుల మీద పడుంటారు. అడేమో జైలు కమ్మి లట్టుకొని ఏడుత్తూ ఉంటాడు. యదవ బతుకు! తన మాట వినుకుంటేగా?'

దిష్టిబొమ్మ ఉన్నవైపు చూశాడు. చీకట్లో తెల్లగా కనిపిస్తూనే ఉంది.

దిష్టిబొమ్మ నవ్వుతూంది! పగలబడి నవ్వుతూంది!

'నీ యవ్వ... కాళ్ళిరగ గొడతా! నీతల బద్దలు కొడతా! ఇదంతా నువ్వే చేశావు. నీ మూలకంగానే ఈ దరిద్రం పట్టుకొంది. నిన్ను చంపితే ఓడు అడ్డం వత్తాడు?'

దిగ్గున లేచాడు మల్లయ్య.

ఒళ్ళంతా గునపాలతో పొడిచినట్లుగా ఉంది.

మంచె దిగుతూ కళ్ళు తిరిగి కిందపడ్డాడు. మోచేతులు, మోకాళ్ళు డొక్కుపోయాయి.

మల్లయ్య బక్క కోపం ఎక్కువయింది. పళ్ళు పటపట కొరుకుతూ దిష్టిబొమ్మవైపు చూశాడు.

దిష్టిబొమ్మ నవ్వుతూనే ఉంది. దానికి తలగా అమర్చిన సున్నంగొట్టిన మట్టి పిడత చీకట్లో తలకు చుట్టుకొన్న తలపాగాలా కనిపిస్తూంది.

మల్లయ్య తూలుతూ దాన్ని నిలబెట్టిన కఱ్ఱ దగ్గర కొచ్చాడు. ఉన్న శక్తినంతా ఉపయోగించి ఆ కఱ్ఱను భూమిలో నుంచి ఊడబెరికాడు.

ఆ ఊపుకి దిష్టిబొమ్మతోబాటే తనూ కిందపడ్డాడు.

మట్టిపిడత పప్పు పప్పు అయింది. కఱ్ఱ తీసుకుని దిష్టిబొమ్మను గట్టిగా బాదాడు. చొక్కా లోపలిగడ్డి గరగరలాడింది. దాన్ని తగలబెట్టాలని అగ్గిపెట్టె కోసం జేబులో చెయ్యి పెట్టి తడుముకొన్నాడు.

అగ్గిపెట్టె దొరికింది. పుల్లల్లేవు పిచ్చికోపంతో దిష్టిబొమ్మను కాలితో తన్నటం మొదలుపెట్టాడు.

మొక్కుకొన్న చేలో ఏదో చప్పుడైంది.

కొన్ని క్షణాలు కదలకుండా నిలబడిపోయాడు.

ఎవరో మొక్కజొన్న కండెలువిరుస్తున్నారు. మల్లయ్య తీవ్రంగా ఆలోచిస్తూ నిలబడ్డాడు.

'బుచ్చిరాజు మూలకంగానే తన కుటుంబం నాశనం అయింది. ఆడికెందుకు సాయం చెయ్యాలి? ఈ పొలమంతా నాశనం అయినా ఆడికేం నట్టం ఉండదు. కానీ.... కానీ... ఇన్నాళ్ళూ మంచోడని పేరు సంపాయించాడు తను. ఆ మంచంతా గంగలో కలిసిపోద్ది. ఆడి కొలువు యిట్టం లేకపోతే మానెయ్యాలి. పని ఒగ్గెయ్యకుండా యిసుమంటి పని సెయ్యకూడదు. దొంగలపని పట్టాల."

లేని ఓపికతో చప్పుడైనవైపుకు మూడడుగులు వేశాడు.

"టప్!" మని ఎవరో నెత్తిమీద బాదటంతో అక్కడే మొదలు నరికిన చెట్టులా పడిపోయాడు.

❖ ❖ ❖

మరుసటిరోజు ఉదయం బుచ్చిరాజు ఊళ్ళోజనాన్ని వెంటేసుకుని పొలానికి వచ్చాడు.

ఆకారం కోల్పోయి వికారంగా తయారైన దిష్టిబొమ్మను, మల్లయ్యను చూసి ముక్కుమీద వేలేసుకోలేదు.

మల్లయ్యకు అక్కడే సమాధి కట్టిస్తానన్నాడు.

జనం బుచ్చిరాజును పొగిడేశారు.

'కూలోడంటే మా చెడ్డపేమ' అనుకున్నాడో కూలి.

వారంరోజులు తిరిగేసరికి కొత్తపాలేరు కూనిరాగం తీస్తూ మంచెమీద కూర్చున్నాడు.

దిష్టిబొమ్మ మళ్ళీ ముస్తాబయింది.

– 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక **5 -11- 1972**